క్లుప్తంగా

కౌలు కార్డుల పంపిణీ



కౌలు రైతులకు కార్డులు అందజేస్తున్న తహసీల్దార్ సుదర్శన్ తదితరులు

దత్తిరాజేరు: మండలంలోని కన్నాం గ్రామంలో కౌలు రైతులకు పంటసాగుదారు హక్కు ధ్రువీకరణ పత్రాల(సీసీఆర్సీ)ను ఏఓ అనురాధ ఆధ్వర్యంలో తహసీల్దార్ సుదర్శన్ గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్సీలు (క్రాప్ కల్టివేటెడ్ రైట్స్ కార్డు) కలిగి ఉండడం వల్ల ప్రభుత్వం నుంచి రాయితీలు అందుతాయని చెప్పారు.గురువారం తెలిపారు. సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరు వాటర్ ప్లాంట్ల సీజ్

దత్తిరాజేరు: మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఆరు వాటర్ ప్లాంట్లను గుర్తించి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేశామని తహసీల్దార్ సుదర్శన్ గురువారం తెలిపారు. సరయ్యవలస గ్రామంలో రాయపాటి సునీత, మరడాంలో దయాశెట్టి నాగేశ్వరరావు, దత్తిలో చెవేర సూర్యారావు, వంగరలో పిల్ల పైడిపునాయుడు, దత్తిరాజేరులో బాలి రామారావు, పోరలిలో ఉండ్రాల్ల అప్పలరాజు నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌లను సీజ్ చేశారు.

గంజాయి రవాణాపై నిఘా



బొద్దాం జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రాజేష్

వేపాడ: గంజాయి రవాణాను నియంత్రించడంలో భాగంగా పోలీసులు గట్టి నిఘా పెట్టారు. మండలంలోని బొద్దాం జంక్షన్‌లో ఎస్ఐ రాజేష్ పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. కార్లు, బస్సులు, ఇతర వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. వాహన పత్రాలు, వాహనచోదకులకు లైసెన్స్ లేకుంటే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

గెస్ట్ అధ్యాపకులకు ఆహ్వానం

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్లుగా పని చేసేందుకు ఔత్సాహికులైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో పొలిటికల్ సైన్స్, కామర్స్, ఫిజిక్స్, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. అర్హులు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5గంటలులోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

బిందు సేద్యం పరికరాల పరిశీలన

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో రైతు గండి మంగబాబు వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన బిందు సేద్యం పరికరాలను ఏపీఎంఐపీ డైరెక్టర్ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ బోర్లు ఉన్న రైతులకు ప్రభుత్వం రాయితీపై బిందు, తుంపర సేద్యం పరికరాలను రాయితీపై అందజేస్తోందని చెప్పారు. బిందు, తుంపర సేద్యం విధానంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చని, ఎరువులు కూడా డ్రిప్ ద్వారా పంటకు అందించవచ్చన్నారు.

కార్మిక హక్కులను కాలరాసిన కేంద్రం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

గజపతినగరం: కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఒమ్మి రమణ మండిపడ్డారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సీపీఐ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతూ దేశం అభివృద్ధిని విస్మరించారన్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కూటమి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని, కేంద్రంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ ప్రత్యేక హోదా కోసం పార్లమెంటు సమావేశాల్లో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. రానున్న రోజుల్లో పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి పాత కార్మిక చట్టాలను, ప్రత్యేక హోదా, రైల్వేజోన్‌ను సాధించుకుంటామని చెప్పారు. గజపతినగరం నియోజకవర్గ సీపీఐ కో-కన్వీనర్ పురం అప్పారావు, మండల కన్వీనర్ గేదెల రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవచూపండి

- సమస్యలపై 'గ్రామ సందర్శన'లో అధికారులకు ఫిర్యాదులు



దత్తిరాజేరు: కన్నాం గ్రామంలో పర్యటిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



వేపాడ: కొండగంగుబూడిలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న అధికారులు



లక్కవరపుకోట: గనివాడ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు,ఎంపీపీ శ్రీనివాసరావు



గజపతినగరం రూరల్: కొణిశ పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూస్తున్న అధికారులు, నాయకులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): చుక్కవలస అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: గ్రామాల్లో ప్రజాసమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి సూచించారు. గ్రామసందర్శన కార్యక్రమంలో భాగంగా మండల ప్రత్యేక అధికారి ఎం.నూకరాజు ఆధ్వర్యంలో కన్నాం గ్రామంలో అధికారులు, మండల, స్థానిక ప్రజాప్రతినిధులు గురువా రం పర్యటించారు. గ్రామంలో ప్రాథమిక పాఠశాల,అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ డిపోలను సందర్శించా రు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రానికి భవ నాలు మంజూరు చేయాలని, సామాజిక భవనం నిర్మించాలని, శ్మశానవాటికకు రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు అధికారులను కోరారు. ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సుదర్శన్, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



వేపాడ: కొండగంగుబూడి ఆశ్రమ పాఠశాలలో కొబ్బరి మొక్కనాటుతున్న నోడల్ అధికారి లక్ష్మీనారాయణ

సీసీ రోడ్లు, కాలువలు నిర్మించండి

మెరకముడిదాం: గరుగుబిల్లి గ్రామంలో మండల ప్రత్యేక అధికారి శ్రీధర్‌రాజా, ఎంపీడీఓ పావని ఆధ్వర్యంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన అధికారుల దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకువచ్చారు. వీధుల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించాలని అధికారులను కోరారు. అధికారులు ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన వంటకాల ను పరిశీలించారు. పాఠశాల భవనంలోనే నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రానికి సొంతభవనం లేని విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని అధికారులు తెలిపారు. అలాగే ఎస్టీ కాలనీ సమీపంలోని ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు. సర్పంచ్ అప్పలనాయుడు, తహసీల్దార్ పద్మావతి, ఏఓ శ్రావణితేజ, ఏపీఎం ఉమామహేశ్వరరావు, పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గుర్ల: చింతలపేటలో విద్యుత్‌కోతలపై మండల ప్రత్యేకాధికారికి ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ భాస్కరరావు

విద్యుత్ కోతలపై ఫిర్యాదు

గుర్ల: చింతలపేట గ్రామంలో మండల ప్రత్యేకాధికారి జి.పెంటోజీరావు ఆధ్వర్యంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. తమ గ్రామానికి తరచూ రాత్రి వేళల్లో అనధికారంగా విద్యుత్ కోతలు విధిస్తున్నారని, సమస్య ను పరిష్కరించాలని అధికారులకు సర్పంచ్ పతివాడ భాస్కరరావు ఫిర్యాదు చేశారు. గ్రామంలో ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ఎంపీడీఓ బి.వెంకటరమణ, తహసీల్దార్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలపై గందరగోళం

గంట్యాడ: నరవ గ్రామంలో మండల ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి అరుణశ్రీ ఆధ్వర్యంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. అధికారులు గ్రామంలో పర్యటించి రోడ్లు, కాలువులు, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను పరిశీ లించారు. అనంతరం సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. తమకు ఇచ్చిన ఇళ్ల పట్టాలపై వేరేవారు ఇళ్లు నిర్మించారని, మా పట్టాలపై ఇతరులు ఏవిధంగా ఇళ్లు నిర్మిస్తారని అధికారులను పలువురు నిలదీశారు. దీంతో సభలో గందగోళం నెలకొంది. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ప్రత్యేకాధికారి తెలపడంతో వివాదం సద్దుమణిగింది. ఎంపీడీఓ వై.భవాని, తహసీల్దార్, నీలకంఠేశ్వరరెడ్డి, సీడీపీఓ ఉమాభారతి, ఏఓ శ్యామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మెరకముడిదాం: గరుగుబిల్లి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నభోజన వంటలను పరిశీలిస్తున్న ప్రత్యేకఅధికారి శ్రీధర్‌రాజా, తదితరులు

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

వేపాడ: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని మండల అధికారులు అన్నారు. కొండగంగుబూడి పంచాయతీలో నోడల్ అధికారి పి.ఎస్.వి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. కొండగంగుబూడి గ్రామంలో అధికారులు పారిశుద్ధ్య పనులు చేశారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అనంతరం గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీని, పంచాయతీ పరిధిలోని బంగారమ్మపేట, ఎస్.కోటసీతారాంపురం తదితర గ్రామాలను సందర్శిం చారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను, అంగన్‌వాడీకేంద్రంలో పిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కొండగంగుబూడి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఆవరణలో నోడల్ అధికారి కొబ్బరి మొక్కలు నాటారు.నోడల్ అధికారితో పాటు పలువురు అధికారులు అదే పాఠశాలలో రాత్రి పల్లెనిద్ర చేశారు. తహసీల్దార్ సత్యం, ఎంపీడీఓ నిశ్చల, ఎంఈఓ బాలభాస్కరరావు, ఏఓ యశ్వం తరావు, ఏఈలు ఆలీ, దేవీ, విద్యుత్‌శాఖ ఏఈ సూరిబాబు, ఏపీఎం వెంకటరమణ, ఏపీఓ ఆదిలక్ష్మి, సర్పంచ్ బంగారయ్య, ఎంపీటీసీ దాయిరి ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



గంట్యాడ: నరవలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి అరుణశ్రీ, తదితరులు

కొణిశ గ్రామంలో..

గజపతినగరం రూరల్: మండలంలోని కొణిశ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి ఎస్.రామ్మూర్తి ఆధ్వర్యంలో గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. ముందుగా ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి, వంటకాలను రుచి చూశారు. అనంతరం అక్కడే ఉన్న భారత్ ఆయుష్మాన్ భవన్ కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. రోజూ ఎంత ఓపీ నమోదు అవుతోంది, రోగులకు అందిస్తున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు.ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, నాయకులు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

చుక్కవలసలో..

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని చుక్కవలసలో మండల ప్రత్యేకాధికారి వై.వి.రమణ ఆధ్వర్యంలో గురువారం గ్రామసందర్శన నిర్వ హించా రు. గ్రామ సచివాలయం, వెలెనెస్ సెంటర్, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఎంపీడీఓ మధుసూదనరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు సీడీపీఓ ఆరుద్ర, తదితరులు పాల్గొన్నారు.

గనివాడ,దేశపాత్రునిపాలెంలో

కొత్తవలస/లక్కవరపుకోట: కొత్తవలస మండలంలోని దేశపాత్రునిపాలెం, లక్కవరపుకోట మండలంలోని గనివాడ గ్రామాల్లో మండల నోడల్ అదికారుల నేతృత్వంలో అధికారులు గురువారం గ్రామసందర్శన నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: దేశపాత్రునిపాలెంలో సచివాలయంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీపురుపల్లి: వర్షాలు కురుస్తుండడంతో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని స్థానిక మేజర్ పంచాయతీ అధికారి వై.ఝాన్సీ చెప్పారు. అందులో భాగంగానే మేజర్ పంచాయతీ పరిధిలోని హడ్కోకాలనీ, కుమ్మరికాలనీ, వెంకటేశ్వర్‌నగర్ తదితర ప్రాంతాల్లో దోమల నివారణకు గురువారం మలాథియన్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వార్డు, వీధిలోని కాలువల్లో మలాథియన్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్నట్లు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాలరావు, జూనియర్ అసిస్టెంట్ రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



హడ్కోకాలనీలో మలాథియన్ ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న పంచాయతీ అధికారులు

హెల్మెట్ ధరించకుంటే జరిమానా

బొండపల్లి: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకుంటే జరిమానాతో పాటు జైలుశిక్ష తప్పదని ఎస్ఐ కె.లక్ష్మణరావు అన్నారు. చందక పేటలో జాతీయ రహదారి-26పై పోలీస్ సిబ్బందితో కలిసి గురు వారం వాహన తనిఖీలు నిర్వహించా రు.హెల్మెట్ ధరించని ద్విచక్రవాహన చోదకులకు జరిమా నా విధించారు. ఈసందర్భంగా వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు బైక్‌లు వల్లే జరుగుతు న్నాయని, చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. మైనర్లకు బైక్‌లు ఇస్తే, వాహన యజమా నిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



హెల్మెట్ ధరించని వాహన చోదకులకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

బల్లంకిలో పశువైద్య శిబిరం

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో వేపాడ పశువైద్యాధికారి సింహాచలంనాయుడు ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వ హించారు. శిబిరంలో పశువులకు ఏడీఏ చలపతిరావు గర్భకోశ వ్యాధి చికిత్సలతో పాటు వివిధ వైద్యపరీక్షలు చేశారు. అనంతరం పశువులకు అవసరమైన మందులు, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను పాడిరైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పశువైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో తనిఖీలు

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోలో డిప్యూటీ సీఎంఈ కె.శ్రీనివాసరావు గురువారం మధ్యాహ్నం తనిఖీలు చేశారు. గ్యారేజీలో అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్క్రాప్, డంపింగ్, డీజిల్ విభాగాలను పరిశీలించి సిబ్బందికి, ఉద్యోగులకు కొన్ని సూచనలు చేశారు. ఆయన వెంట డీఎం కె.రమేష్, ఆర్ఎస్‌డీఐ వేణు, ఎంఎఫ్ రాజు ఉన్నారు.



డిపోలో డీజిల్ విభాగాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎంఈ శ్రీనివాసరావు

ఆంధ్రాను ఉద్ధరించినట్టు ఉత్తుత్తి కబుర్లు

- కేంద్ర బడ్జెట్‌పై సీపీఎం నిరసన



గజపతినగరం: గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేతలు



శృంగవరపుకోట: ఎస్.కోటలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు



లక్కవరపుకోట: గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు



కొత్తవలస: కొత్తవలసలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

శృంగవరపుకోట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీని ఎండబెట్టిన కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ ఆంధ్రాను ఉద్ధరించినట్టు ఉత్తకబుర్లు చెప్పడం సిగ్గుచేటని సీపీఎం నాయకులు కె.సురేష్, మద్దిల రమణ అన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈసంద ర్భంగా వారు మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు గ్రాంట్‌గా కాకుండా అప్పులుగా ఇస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. అప్పులు, వడ్డీలు ఎవరు తీరుస్తారని, పోలవరం బాధ్యత తమదేనని అన్నారే తప్ప బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పలేదన్నారు. విభజన చట్టంలో ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాలకు స్పెషల్ ప్యాకేజీల చర్చ ఎందుకు లేదని నిలదీశారు. జిల్లాలో గిరిజన యూనివ ర్సిటీకి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ముడిసరుకు బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్‌లో ఏదో సాధించినట్టు కూటమి నేతలు ఎందుకు సంబరాలు చేసుకుంటున్నారని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు సీహెచ్.ముత్యాలు, టి.చిన్న, ఎస్.బుజ్జి, రాము, టి.సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాకు అన్యాయం

లక్కవరపుకోట/కొత్తవలస/ వేపాడ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఎల్.కోటలో సీపీఎం మండల అధ్యక్షుడు టి.వెంకటరమణ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులతో కలిసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలపగా, కొత్తవలసలో జంక్షన్‌లో గాడి అప్పారావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. వేపాడ మండ లంలోని బొద్దాం జంక్షన్‌లో ఏపీ రైతసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ బడ్జెట్‌లో రైతుల కు తీవ్రఅన్యాయం చేశారని, పీఎం కిసాన్ సహాయం పెంచలేదని, పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించలేదని అన్నారు.

పెట్టుబడిదారుల బడ్జెట్

గజపతినగరం: పేద ప్రజల సంక్షేమాన్ని విస్మరించి కార్పొరేట్ వ్యక్తులకు, పెట్టుబడిదారులకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయింపులు చేసిందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ ఆరోపించిరు. కేంద్ర బడ్జెట్‌ను నిరసిస్తూ, పేద ప్రజలకు మేలు చేసేలా కేంద్ర ప్రభుత్వంలో పెద్దల బుద్ధిని మార్చాలని కోరుతూ గజపతినగరం ఏరియా ఆస్పత్రి సమీపంలోని మహాత్మా గాంధా విగ్రహానికి సీపీఎం నాయకులు గురువారం వినతిపత్రం సమర్పించారు. ప్రత్యేక హోదా, రైల్వేజోన్ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు రాకోటి రాములు, నాయకులు నాగేశ్వరరావు,తంటి పాక రాము,కోటి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకంత ప్రేమ..!

- చనిపోయిన వారి పేరున షాపులా?
- అడ్డగోలు అప్రూవల్స్ ఎలా?
- పంచాయతీని గుల్ల చేస్తున్నారు
- పాలకవర్గ సమావేశంలో నిలదీసిన ఉపసర్పంచ్

శృంగవరపుకోట: పంచాయతీకి వేలల్లో అద్దెలు వస్తున్న దుకాణాలను ఇప్పటికీ పూర్వపు అద్దెలతోనే ఎలా నడుపుతారు?.. దశాబ్దాల కిందట దుకాణాలు పొందినవారు చనిపోగా... ఆ దుకాణాలను బినామీలు ఆక్రమించి అనుభవిస్తున్నారు.. ఏటా పంచాయతీ రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతుంటే ఎందుకు మాట్లాడరని ఉపసర్పంచ్ మోపాడ కుమార్ నిలదీశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ డి.సంతోషికుమారి అధ్యక్షతన, పంచాయతీ ఈఓ వి.వి.అనూరాధ నేతృత్వంలో వేలంపాటల ఖరారు కోసం గురువారం పాలకవర్గ సమావేశం నిర్వహించారు. రోజువారీ మార్కెట్, వారపుసంత, కబేళా, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ, పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల వేలంపాటలను సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ కుమార్ మాట్లాడుతూ ఇంటిపన్ను విధింపుల్లో చాలా అవకతవకలు ఉన్నాయని, ఆస్పత్రులు, స్కూళ్లు, కాలేజీలు, మాల్స్, గోడౌన్స్‌కి ఇళ్లతో సమానంగా పన్నులు ఎలా వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఇంటికోసం ప్లాన్‌అప్రూవల్ తీసుకుని దుకాణాలు కట్టి పంచాయతీ స్థలం, రోడ్డు ఆక్రమిస్తే ఎలా అనుమతించారని నిలదీశారు. పంచాయతీకి ఇటీవల వచ్చిన 13 ప్లాన్‌అప్రూవల్స్ దరఖాస్తుల్లో చెరువులు, లేఔట్లలో ఉన్నవాటికి అనుమతులు ఎలా ఇస్తారని, వాటిని ఆపాలని కోరారు. గతంలో పంచాయతీ దుకాణాలకు 50శాతం అద్దెలు పెంచుతామని తీర్మానం చేసి, ఇప్పుడు 15 శాతం పెంచుదామన్న ప్రతిపాదన ఎందుకు తెచ్చారో సభ్యులకు చెప్పాలన్నారు. అద్దెల విషయంలో పెద్ద మొత్తంలో సొమ్ములు చేతులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయన్నారు. 36 దుకాణాలు పొందిన వారిలో 14 మంది చనిపోతే బినామీలు ఎలా ఆక్రమించుకుంటారన్నారు. పంచాయతీ దుకాణాన్ని ఒక వ్యక్తి 2లక్షలకు కొనగోలుచేయడం చూస్తుంటే పంచాయతీ అధికార యంత్రాంగం ఏమిచేస్తుందో తెలియడంలేదన్నారు. పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని దుస్థితిలో నెలకు రూ.30వేలు అద్దె వచ్చే దుకాణాలు కేవలం రూ.3వేలకు ఎలా కేటాయిస్తారన్నారు. వారిపై ఎందుకు అంత ప్రేమ అని ప్రశ్నించారు. పంచాయతీ దుకాణాలకు కొత్తగా వేలంపాట నిర్వహించాలని, లేదంటే 100 శాతం అద్దెలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ వాదనలకు చిప్పాడ శేషగిరి తదితర వార్డు సభ్యులు కొందరు మద్దతు పలికారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



పంచాయతీ సమావేశంలో మాట్లాడుతున్న ఉపసర్పంచ్ కుమార్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొండపల్లి: స్థానిక విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు అనుకుని ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంద ని ఏఈఈ ఆర్.శంకరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని బొండపల్లి, బోడసింగిపేట గ్రామాలకు ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండ దని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

గుర్ల సబ్‌స్టేషన్ పరిధిలో..

గుర్ల: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని కెల్ల, గరిడ, రెల్లిపేట, బెల్లానపేట గ్రామాలకు శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారి పూడి హరి గురు వారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాఠశాలల సందర్శన

లక్కవరపుకోట: జమ్మాదేవీపేటలోని గురుకుల బాలికల పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ గురువారం సందర్శించారు. శిక్షా సప్తాహ్ పేరుతో నిర్వహిస్తున్న కార్యక్రమాలను, పాఠశాల పరిస రాలు, తరగతిగదులను పరిశీలించారు. లెసన్ ప్లాన్ మేరకు బోధన చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించా లని సూచించారు. ఎంఈఓ కూర్మారావు, ప్రిన్సిపాల్ విజయకుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



లక్కవరపుకోట: జమ్మాదేవీపేట గురుకుల పాఠశాలలో తరగతిగదిని పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

ఎంఈఓల తనిఖీలు

వేపాడ/శృంగవరపుకోట: వేపాడ మండలంలోని నల్లబిల్లి ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-1 జగదీశ్వరరావు, ఎస్.కోట మండలంలోని సంతగవిరమ్మ పేట ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈఓ నర్సింగరావు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు,విద్యార్థుల హాజరు రికార్డులతో పాటు ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్‌లు, విద్యార్థుల నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు.